క్లుప్తంగా

సర్వే వేగంగా పూర్తి చేయాలి

ఇల్లెందురూరల్: మహాలక్ష్మి దరఖాస్తులపై ఇంటింటి సర్వేను వేగంగా పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి జినుగు మరియన్న ఆదేశించారు. మండలంలోని సుభాష్‌నగర్, బాలాజీనగర్ గ్రామపంచాయతీల్లో శనివారం మహాలక్ష్మి దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను పరిశీలించారు. ప్రతి దరఖాస్తుదారుడిని స్వయంగా కలిసి అన్ని వివరాలను సమగ్రంగా పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు రజినీకాంత్, నీలిమ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

జూలూరుపాడు: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహజ్యోతి పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జూలూరుపాడు విద్యుత్‌శాఖ ఏఈ సతీశ్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్లు ఉచిత కరెంటు కోసం వినియోగదారుల నుంచి వివరాలు సేకరిస్తున్నారని తెలిపారు.

ఆర్‌ఎంపీల సమస్యలు పరిష్కరించండి..

జూలూరుపాడు: ఆర్‌ఎంపీ, పీఎంపీల సమస్యలను పరిష్కరించాలని ఆర్‌ఎంపీ, పీఎంపీ అసోసియేషన్ మండల అధ్యక్షుడు రామరాజు ప్రభుత్వాన్ని కోరారు. శనివారం జూలూరుపాడులో ఆర్‌ఎంపీ, పీఎంపీ అసోసియేషన్ మండల కమిటీ సమావేశం నిర్వహించగా ఆయన పాల్గొని మాట్లాడారు. మారుమూల గిరిజన ప్రాంతాల్లోని ప్రజలకు ఆర్‌ఎంపీ, పీఎంపీలు వైద్యసేవలు అందిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో జి.నాగేశ్వరరావు, శ్రీహరి, పలువురు ఆర్‌ఎంపీలు పాల్గొన్నారు.

మేడారం జాతరపై విద్యార్థుల సమావేశం

జూలూరుపాడు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం మేడారం సమ్మక్క – సారలమ్మ జాతరపై విద్యార్థులు సమావేశాన్ని నిర్వహించారు. డీఈఓ వెంకటేశ్వరాచారి ఆదేశాల మేరకు జూలూరుపాడు హైస్కూల్ హెచ్‌ఎం లక్ష్మీనర్సయ్య ఆధ్వర్యంలో 8, 9 తరగతుల విద్యార్థులను నాలుగు బృందాలుగా ఏర్పాటు చేశారు. అధికార పక్షం, ప్రతిపక్షం, అధికారులు, ప్రతికా విలేకరులుగా విభజించారు. సమ్మక్క, సాలమ్మ జాతర సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పర్యావరణ పరమైన చర్యలపై నాలుగు బృందాలు చర్చించాయి.

కుట్టుమిషన్ అందజేత

పాల్వంచ: యేసు కరుణా సువార్త మందిరం స్వచ్ఛంద సేవా సంస్థ 9వ వార్షికోత్సవం పురస్కరించుకుని మండలంలోని కిన్నెరసాని గ్రామానికి చెందిన పేద మహిళ వై.నిర్మలకు రూ.10 వేల విలువ చేసే జిగ్‌జాగ్ కుట్టు మిషన్‌ను అందించారు. ఎం.ప్రభుదాస్, సురేశ్, కొండ్లె రవి, సురేశ్, కిరణ్, మధు, విజయ్, కాటయ్య, బబ్లూ, అప్పారావు, నాగేశ్వరరావు, ఆంజనేయులు, మైబూబ్ పాల్గొన్నారు.

నియామకపత్రం..

పాల్వంచ: జగదాంబ, మేడారం, భద్రకాళి పూజారుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా భూక్యా అచ్చానాయక్ నియమితులయ్యారు. శనివారం స్థానిక కరకవాగులో సంఘం జాతీయ అధ్యక్షుడు తేజావత్ రాములునాయక్ చేతుల మీదుగా నియామకపత్రాన్ని అందుకున్నారు.

అధికారుల సంఘం నేతకు సన్మానం



లక్ష్మీపతిగౌడ్‌ను సత్కరిస్తున్న దృశ్యం

ఇల్లెందు: ఇటీవల సింగరేణిలో అధికారుల సంఘానికి జరిగిన ఎన్నికల్లో గెలుపొందిన లక్ష్మీపతిగౌడ్‌ను ఇల్లెందు ఏరియా అధికారుల సంఘం నేతలు ఘనంగా సత్కరించారు. ఏజీ శివప్రసాద్, ఎం.చిన్నయ్య, కె.శ్రీనివాస్, బి.నాగేశ్వరరావు, వీరభద్రం, రాంబాబు, లింగబాబు, మదార్‌సాహెబ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

గ్రూప్-4లో 536వ ర్యాంక్

పాల్వంచరూరల్: నాగారం గ్రామానికి చెందిన గ్రామపంచాయతీ కార్యాలయంలో మల్టీ పర్పస్ వర్కర్‌గా పనిచేస్తున్న చెంచలపు శ్రీను, కృష్ణవేణి దంపతుల కుమారుడు తరుణ్‌సాయికి గ్రూప్–4 ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 536వ ర్యాంక్ సాధించాడు. జిల్లాస్థాయిలో 12వ ర్యాంక్ సాధించిన ఆయన అగ్నిమాపకశాఖలో కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

ఇల్లెందు: వేపలగడ్డతండాలో ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ చేసిన పీడీఎస్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. ఇల్లెందు ఎస్‌ఐ రవూఫ్ కథనం ప్రకారం.. బొజ్జాయిగూడెం పంచాయతీ వేపలగడ్డతండాకు చెందిన గుగులోత్ మంగీలాల్ తన ఇంట్లో ఎనిమిది క్వింటాళ్ల పీడీఎస్ రైస్‌ను నిల్వ చేశాడు. బియ్యాన్ని పట్టుకుని, కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

దట్టమైన అడవిలో దర్గా!

- సకల జనుల దైవం.. జాన్‌పాక్‌షాహీ దర్గా
- వందేళ్లుగా కొనసాగుతున్న ప్రార్థనలు
- ఇల్లెందు ప్రాంతంలో తొలి దర్గా.. నిత్యం భక్తులతో సందడి



జెండాలవాగు వద్ద కొలువుదీరిన జాన్‌పాక్ షహీ దర్గా

ఇల్లెందురూరల్: ఇల్లెందు ప్రాంతంలో తొలి దర్గాగా.. వందేళ్ల కిందట వెలిసిన జాన్‌పాక్ షహీ దర్గా కులమత భేదం లేకుండా ఆధ్యాత్మిక క్షేత్రంగా విలసిల్లుతోంది. ఇల్లెందు ప్రాంతం సింగరేణి కార్మికులతో కళకళలాడుతున్న రోజుల్లో స్టేషన్‌బస్తీలో నివాసముండే సయ్యద్ ఖాసీం గాజులు విక్రయిస్తూ జీవనం సాగించేవాడు. ఆయన సాయం కోసం వచ్చిన యాదవ మహిళకు తన కలలో అందిన ఆదేశానికి అనుగుణంగా ధూపం వేయమని సూచించాడట. అనంతరం ఖాసీం సూచన మేరకు ఆ యాదవ కుటుంబం జాన్‌పాక్ షాహీ పేరుతో దర్గా నిర్మాణానికి అంకురార్పణ చేయగా నేటికీ పూజలు కొనసాగుతున్నాయి.

జెండాల వాగుగా ప్రసిద్ధి..

సమీపంలోని గుట్టల నుంచి జాలువారిన నీటితో వాగు ఏర్పడగా.. వాగు వెంట రహదారి పక్కనే నిర్మించిన దర్గా క్రమంగా ఆధ్యాత్మిక క్షేత్రంగా వెలుగొందుతోంది. దర్గా సమీపంలో దట్టమైన అటవీ ప్రాంతం కూడా ఉండటంతో వారాంతపు విడిది కేంద్రంగా మారింది. నాటి నుంచి ఈ ప్రాంతాన్ని జెండాల వాగుగా పిలవడం ప్రారంభించారు. ఇక ఇల్లెందులో సింగరేణి సంస్థ ప్రారంభమైన రోజుల్లో మొహర్రం పండుగ రోజున గని అధికారులతోపాటు వంద మంది వరకు కార్మికులు మృతి చెందారు. ఈ ఘటనతో గనిలో తవ్వకాల సమయాన ప్రమాదాలు జరగకూడదని కార్మికులు జాన్‌పాక్ షాహీ దర్గాలో పూజలు చేసేవారు. ఆక్రమంలోనే సింగరేణి వ్యాప్తంగా ఆదివారం సెలవు ఉన్నా ఇల్లెందు ఏరియాలో మాత్రం శుక్రవారం సెలవు రోజుగా ఉంటుంది. దీంతో సహజంగానే కార్మికులు సెలవు రోజున కుటుంబ సభ్యులతో కలిసి జెండాల వాగు వద్దకు వచ్చి పూజలు చేస్తుండగా రద్దీ కూడా క్రమంగా పెరుగుతోంది.

నమ్మకంతోనే భక్తుల పూజలు

జాన్‌పాక్ షాహీ దర్గా ఇల్లెందు – మహబూబాబాద్ ప్రధాన రహదారి పక్కనే ఉండటంతో వాహనదారులు ఇక్కడ కొద్ది సేపు విశ్రాంతి తీసుకొని దర్గాలో పూజలు చేస్తారు. ఇంతేకాకుండా సమీప గ్రామాలకు చెందిన వ్యవసాయ కూలీలు పనుల ప్రారంభ సమయాన ప్రత్యేక పూజలు చేయడం, పనులు పూర్తయ్యాక విందు ఏర్పాటు చేసుకోవడం ఆనవాయితీగా వస్తోంది.



విడిదికి అనుకూలంగా ఉన్న వనం



దర్గా ప్రాంగణంలో విడిది చేసిన మహిళలు

సౌకర్యాలు కూడా కల్పిస్తే..

జెండాల వాగు, జాన్‌పాక్ షాహీ దర్గా భక్తుల రద్దీకి తగినట్లుగా ఏర్పాట్లు లేవు. ప్రజాప్రతినిధులు, అధికారులు పెద్దగా దృష్టి సారించకపోవడంతో వందేళ్ల కిందట భక్తులు తవ్విన మంచినీటి బావి నిర్వహణ లేక నేడు ఛిద్రమైంది. జెడ్పీ చైర్మన్‌గా చందా లింగయ్య దర్గాను సందర్శించిన సమయంలో బోరు వేయించారు. కానీ, ఇప్పుడు ఆ బోర్ కూడా కనుమరుగయ్యే పరిస్థితి నెలకొంది. అయితే, ప్రస్తుత ఎమ్మెల్యే కోరం కనకయ్య దర్గా పక్కనే భక్తుల కోసం వేయించిన షెడ్డు మాత్రమే కాస్త సౌకర్యం కల్పిస్తోంది. కాగా, దర్గా ఏర్పడిన తొలినాళ్లలో సువిశాలమైన స్థలం ఉండగా.. కాలక్రమేణా ఆక్రమణలతో రహదారి పక్కన కొద్దిపాటి స్థలం మాత్రమే భక్తుల విడిదికి ఉపయోగపడుతోంది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి జాన్‌పాక్ షాహీ దర్గా వద్ద సౌకర్యాలను మెరుగుపరిస్తే భక్తులకు వారాంతపు విడిది కేంద్రంగా ఉపయోగపడుతుంది.

ఏటా మొక్కులు చెల్లించుకుంటాం



ఏటా వ్యవసాయ పనులు ప్రారంభించే సమయాన కూలీలందరం దర్గా వద్ద పూజలు చేస్తాం. పని సమయంలో, రాకపోకల వేళ ప్రమాదాలు జరగకూడదని మొక్కుతాం. జాన్‌పాక్ షాహీ చల్లని చూపుతో క్షేమంగా ఉంటున్నాం. ఏటా సీజన్‌లో పనులు ముగిసే వేళ మొక్కులు చెల్లించుకొని విందు చేస్తాం.

–మల్లేశ్వరి, సత్యనారాయణపురం, ఇల్లెందు

నమ్మకంతోనే భక్తులు వస్తున్నారు



జాన్‌పాక్ షాహీ దర్గాకు భక్తుల రద్దీ ఉంటోంది. ప్రధాన రహదారి పక్కనే ఉండటం, చుట్టూ అటవీ ప్రాంతం అల్లుకోవడం.. వర్షాకాలంలో వాగులో నీటి ప్రవాహం తదితర కారణాలతో కొంత శుభ్రత లోపం కనిపిస్తోంది. ప్రభుత్వం ఆ లోపాన్ని సరిచేస్తే దర్గాకు పూర్వ వైభవం వస్తుంది.

–ఎస్‌కే ఇమామ్, మాలిక్, జాన్‌పాక్ షాహీ దర్గా

భారతరత్న రావడంపై హర్షం



నివాళులర్పిస్తున్న రంగాకిరణ్ తదితరులు



నివాళులర్పిస్తున్న కొత్వాల శ్రీనివాసరావు

చుంచుపల్లి: పీవీ నరసింహారావుకు భారతరత్న ఇవ్వడంపై బీజేపీ జిల్లా అధ్యక్షుడు కేవీ రంగాకిరణ్ హర్షం వ్యక్తం చేశారు. శనివారం జిల్లా పార్టీ కార్యాలయంలో పీవీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. చింతలచెర్వు శ్రీనివాసరావు, పైడిపాటి రవీందర్, కొమ్ము వంశీ, రాములు, సలీం, అఖిల్, ప్రదీప్‌రెడ్డి, రాజేశ్‌రెడ్డి, సాయివికాస్, నిఖిల్‌యాదవ్ పాల్గొన్నారు.

పీవీకి నివాళి

పాల్వంచరూరల్: భారత దేశ ఖ్యాతిని దేశ విదేశాల్లో చాటిచెప్పిన మహోన్నతమైన వ్యక్తి, మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు అని డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. పీవీ నర్సింహారావుకు దేశ అత్యున్నత పురస్కారం భారతరత్న ప్రకటించడాన్ని హర్షిస్తూ కాంగ్రెస్ ఆధ్వర్యంలో శనివారం మండలంలోని జగన్నాథపురంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జాలే జానకీరెడ్డి, యర్రంశెట్టి ముత్తయ్య, నందనాయక్, కొండం వెంకన్న, అనిత, బాలినేని నాగేశ్వరరావు, గంధం పెద్దరామయ్య, నర్సింహారావు, బాదర్ల జ్యోషి, కుమార్, దయాకర్‌రెడ్డి, సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి శ్రీనివాసరెడ్డిని కలిసిన ఎమ్మెల్యే



పుష్పగుచ్ఛం ఇస్తున్న రాందాస్‌నాయక్

జూలూరుపాడు: రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని హైదరాబాద్ సచివాలయంలో శనివారం వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అదించారు. ఈ సందర్భంగా మంత్రికి వైరా నియోజకవర్గంలోని సమస్యలు వివరించారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ నాయకులు మాలోత్ మంగీలాల్‌నాయక్, వాంకుడోత్ కిషన్‌నాయక్ తదితరులు ఉన్నారు.

విలీన మహాసభను జయప్రదం చేయండి

టేకులపల్లి: సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా, పీసీసీ సీపీఐ ఎంఎల్, సీపీఐ ఎంఎల్ ఆర్‌ఐ విలీనమై సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్‌గా ఏర్పడనుండగా, మార్చి 3, 4, 5వ తేదీల్లో ఖమ్మంలో విలీన సభలు జరగనున్నాయని ప్రజాపంథా టేకులపల్లి మండల కార్యదర్శి ధర్మపురి వీరబ్రహ్మాచారి తెలిపారు. ఈ సందర్భంగా సభల వాల్‌పోస్టర్లను శనివారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. మూడు విప్లవ పార్టీల విలీన సభకు నాయకులు, ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు జర్పుల సుందర్, బానోతు లింగ, భూక్యా పంతులు, ఏనుటి నాగయ్య, లకావత్ నరేశ్, గూగుల్, మదార్, మూడ్ రాము, రమేశ్, అశోక్, రాజేశ్, మల్లేశ్, గణేశ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ సేవాదళ్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా కోటేశ్వరరావు

జూలూరుపాడు: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పాపకొల్లు గ్రామానికి చెందిన కొదుమూరి కోటేశ్వరరావు నియమితులయ్యారు. శనివారం కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్ చేతుల మీదుగా కోటేశ్వరరావు హైదరాబాద్ గాంధీభవన్‌లో నియామకపత్రాన్ని అందుకుని, స్థానిక విలేకరులకు తెలిపారు.

పల్లెల్లో పారిశుద్ధ్యం మెరుగుపర్చాలి



ఇల్లెందురూరల్: పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ



జూలూరుపాడు: చెత్త తొలగిస్తున్న దృశ్యం

ఇల్లెందురూరల్: పల్లెల్లో పారిశుద్ధ్యం మెరుగ్గా ఉండేలా శ్రమించాలని ఎంపీడీఓ బాలరాజు ఆదేశించారు. మండలంలోని బొజ్జాయిగూడెం, కొమ్ముగూడెం గ్రామపంచాయతీల్లో శనివారం పారిశుద్ధ్య పనులను ఆయన పరిశీలించారు. పలు వీధులను సందర్శించి ప్రతి ఇంటి ముందు చెత్త తొలగించడం నిరంతర ప్రక్రియగా.. కుటుంబ సభ్యులు పనులు చేసుకునేలా ప్రోత్సహించాలని చెప్పారు. కార్యక్రమంలో కార్యదర్శులు రజియాబేగం, మౌనిక పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

జూలూరుపాడు: ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాల్లో భాగంగా పల్లెల్లో పంచాయతీ ప్రత్యేక అధికారుల ఆధ్వర్యంలో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు కొనసాగుతున్నాయి. శనివారం గ్రామ వీధులు, ఓవర్ హెడ్ ట్యాంకులు, ఆలయాలు, పంచాయతీ, ప్రభుత్వ కార్యాలయాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, తహసీల్దార్ శారద, ఎంపీఓ తులసీరామ్, ఏఓ ఎస్.రఘుదీపిక, ఎంఈఓ జి.వెంకట్, ఎఫ్‌ఆర్‌ఓ జి.ప్రసాద్‌రావు, పశువైద్యాధికారి బి.బద్దూలాల్, విద్యుత్‌శాఖ ఏఈ సతీశ్, ఇరిగేషన్ ఏఈ మీనా, డిప్యూటీ తహసీల్దార్ గౌతమ్, సీహెచ్‌ఓ వెంకటేశ్వర్లు, సెక్రటరీలు, ఏఎన్‌ఎంలు, ఆశకార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు, పంచాయతీ సిబ్బంది, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

హోరాహోరీగా క్రికెట్ టోర్నీ

టేకులపల్లి: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎదురుగా ఉన్న మైదానంలో ఈ నెల 6న ప్రారంభమైన కనకన్న ప్రీమియర్ లీగ్ (కేపీఎల్ – మూడు నవీన్ మెమోరియల్) సీజన్–1 క్రికెట్ టోర్నమెంట్ ఐదు రోజులుగా హోరాహోరీగా కొనసాగుతోంది. మొత్తం 41 జట్లు తలపడుతున్నాయి. శనివారం నాలుగు మ్యాచుల్లో సులానగర్, కల్లు–11, దాసుతండా, వీకేటీ జూనియర్స్ జట్లు విజయం సాధించాయి. ×మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్× రాందాస్, రాజేశ్, రవి, క్రాంతినాయుడు గెలుచుకున్నారు. పశు వైద్యాధికారి సంతోష్, మాజీ సర్పంచ్ రెడ్యానాయక్, విద్యుత్ ఏఈ దేవా పాల్గొన్నారు.

సమ్మె, బంద్‌ను జయప్రదం చేయండి



ర్యాలీ నిర్వహిస్తున్న ఏఐకేఎంఎస్ నాయకులు

జూలూరుపాడు: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక, కర్షక, వ్యవసాయ కూలీల వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 16న జరిగే దేశవ్యాప్త కార్మిక సమ్మె, గ్రామీణ భారత్‌బంద్‌ను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్‌పాషా పిలుపునిచ్చారు. శనివారం జూలూరుపాడు ఉప మార్కెట్ యార్డులో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. యల్లంకి మధు, ఎస్కే నాగుల్‌మీరా, ఎం.కృష్ణ, ఎస్కే చాంద్‌పాషా, పప్పుల జాను, పందు, బోడయ్య, మైపు శ్రీను, కల్లోజి రామస్వామి, గత్తం బాబూరావు పాల్గొన్నారు. కాగా, 16న జరిగే దేశవ్యాప్త కార్మిక సమ్మె, గ్రామీణ భారత్‌బంద్‌ను జయప్రదం చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం(ఏఐకేఎంఎస్) ఆధ్వర్యంలో శనివారం గుండ్లరేవు, రాంపురంతండా, ఎలుకలొడ్డు, భేతాళపాడు గ్రామాల్లో ర్యాలీ, సభలు నిర్వహించారు. ఎస్కే ఉమర్, వల్లోజి రమేశ్, గలిగె వెంకటేశ్వర్లు, మడి కృష్ణయ్య, బచ్చల నాగేశ్వరరావు, మడి సురేశ్, రమేశ్, శివాజీ, గోవిందు, కాలం బాబు, నాగేశ్వరరావు, భద్రయ్య, వెంకటేశ్వర్లు, ఏనుగు సీతయ్య, నరసింహారావు పాల్గొన్నారు.

ఏఐకేఎంఎస్ ఆధ్వర్యాన ట్రాక్టర్ల ర్యాలీ

టేకులపల్లి: దేశవ్యాప్తంగా ఈ నెల 16న నిర్వహించనున్న సమ్మెను జయప్రదం చేయాలని ఏఐకేఎంఎస్ నాయకులు కోరారు. ఈ సందర్భంగా సంఘం ఆధ్వర్యాన శనివారం మండలంలోని బోడు గ్రామంలో ట్రాక్టర్ల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర నాయకుడు తుపాకుల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ మతతత్వ విధానాలు, కార్మిక, రైతుల విషయంలో వ్యవహరిస్తున్న తీరును అడ్డుకునేలా సమ్మె నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అన్నివర్గాల ప్రజల మద్దతు తెలిపి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు నర్సింహారావు, కల్తీ వెంకటేశ్వర్లు, రామచంద్ర, మేకల వినోద్, రమేశ్, సురేందర్, స్వామి, లక్ష్మయ్య, రామనాథం పాల్గొన్నారు.

సమ్మె పోస్టర్లు ఆవిష్కరణ

ఇల్లెందు: సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం), కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ(సీఐటీయూ) ఆధ్వర్యంలో ఈ నెల 16న జరిగే దేశవ్యాప్త సమ్మెకు సంబంధించిన వాల్‌పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు. సీపీఎం కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నబీ, రేపాకుల శ్రీనివాస్, తాళ్లూరి కృష్ణ, ఆలేటి కిరణ్‌కుమార్, మన్యం మోహన్‌రావు, ఈసం వెంకటమ్మ, మరియ, హుస్సేన్, రాజు, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేయాలి



మాట్లాడుతున్న ఏరియా జీఎం శాలేంరాజు

సింగరేణి(కొత్తగూడెం): ఏరియాలోని జీఎం కార్యాలయంలో వివిధ విభాగాల అధికారులు, ఉద్యోగులు అంకితభావంతో విధులు నిర్వర్తిస్తూ ఏరియాలోని కార్మికులకు సేవలందించాలని కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శాలేంరాజు సూచించారు. శనివారం ఏరియాలోని జీఎం కార్యాలయంలో మల్టీడిపార్ట్‌మెంట్ సమావేశం నిర్వహించగా జీఎం పాల్గొని మాట్లాడారు. సింగరేణి బొగ్గుకు మంచి డిమాండ్ ఉందని, వినియోగం పెరిగినందున నాణ్యమైన బొగ్గును రవాణా చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఓటూ జీఎం కోటిరెడ్డి, ఏజీఎం హేనాసుమలత, డీజీఎం (ఐఈడీ) ఎస్.యోహాన్, పర్సనల్ మేనేజర్ బి.శివకేశవరావు, ఆర్‌సీహెచ్‌పీ ఇన్‌చార్జ్ కరీముల్లా, ఏరియా వర్క్‌షాపు ఇన్‌చార్జ్ టి.శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు టీపీటీఎఫ్ మహాసభలు



మాట్లాడుతున్న టీపీటీఎఫ్ నాయకుడు

టేకులపల్లి: ఖమ్మంలో ఆది, సోమవారం జరగనున్న తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) రాష్ట్ర విద్యా వైజ్ఞానిక మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి హరిలాల్‌నాయక్ కోరారు. మండలంలోని కోయగూడెం ఆశ్రమ ఉన్నత పాఠశాలలో శనివారం జరిగిన ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖమ్మం నయాబజార్ పాఠశాలలో జరిగే సభలకు ఉపాధ్యాయులు, మేధావులు, సామాజికవేత్తలు, విద్యాభిమానులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో టీపీటీఎఫ్ నాయకులు బి.శ్రీనివాస్, ఎం.శారద, ఈ.ముత్తయ్య, టి.శ్రీనివాసరావు జి.రవికుమార్, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

బూడిదను ఉచితంగా అందించాలి



మాట్లాడుతున్న భట్టు మురళి

పాల్వంచ: కేటీపీఎస్ నుంచి వెలువడే బూడిదను ఉచితంగా అందించాలని స్థానికులు భట్టు మురళి, భిక్షపతి రాజు అన్నారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బూడిదను నమ్ముకుని సుమారు 100 కుటుంబాలు జీవిస్తున్నాయని, కానీ, ఇటీవల సంస్థ బూడిదను కొన్ని ఏజెన్సీలకు టన్ను రూ.60 నుంచి రూ.70కు ఇవ్వడం వల్ల తక్కువ బూడిదను మాత్రమే తీసుకెళ్తున్నారని, దీంతో కాలుష్య ప్రభావం ఉంటుందన్నారు. ఇప్పటికైనా యాజమాన్యం స్పందించి స్థానిక కరకవాగు, పునుకుల, పుల్లాయిగూడెం, సూరారం, పాండురంగాపురం గ్రామాలకు చెందిన వారికి న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో డేవిడ్, చల్లా శ్రీనివాసరావు, ప్రవీణ్‌నాయక్, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



పోటీలను ప్రారంభిస్తున్న ఎస్కే సాబీర్‌పాషా

జూలూరుపాడు: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్‌పాషా అనారు. అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) ఆధ్వర్యంలో జూలూరుపాడులో నిర్వహిస్తున్న జూలూరుపాడు, చండ్రుగొండ, ఏన్కూరు మూడు మండలాల స్థాయి క్రికెట్ పోటీలను శనివారం సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించేందుకు క్రికెట్ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో చంద్ర నరేంద్రకుమార్, గుండెపిన్ని వెంకటేశ్వర్లు, ఎస్కే నాగుల్‌మీరా, ఎస్కే చాంద్‌పాషా, యల్లంకి మధు, చింతా స్వరాజ్‌రావు, చనమోలు సుబ్బారావు, వల్లమల్ల చందర్‌రావు, గుగులోత్ వంశీ, చాపలమడుగు నరసింహారావు, చందూరి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడిగా బాబు

జూలూరుపాడు: కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ మండలాధ్యక్షుడిగా అన్నారుపాడుకు చెందిన బానోత్ బాబు నియమితులయ్యారు. ఈ సందర్భంగా శనివారం ఇల్లెందులో కాంగ్రెస్ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గుగులోత్ రవిబాబు ఆయనకు నియామకపత్రం అందజేశారు. నాయకులు లకావత్ లచ్చునాయక్, తాళ్లూరి అచ్చయ్య, ఉమాశంకర్, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

హైపవర్ కమిటీ వేతనాలు ఇవ్వండి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఇల్లెందు: సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు హైపవర్ వేతనాలు ఇవ్వాలని, కార్మికుల సంక్షేమానికి పెద్దపీట వేయాలని ఇఫ్టూ డిమాండ్ చేసింది. శనివారం సింగరేణి సీఎండీ బలరాంను కలిసి ఇఫ్టూ నేతలు వినతిపత్రం అందజేశారు. ఇఫ్టూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాస్ మాట్లాడుతూ.. కాంట్రాక్ట్ కార్మికులకు తీరని అన్యాయం జరుగుతోందని తెలిపారు. ఎండీ రాసుద్దీన్, ఎ.కృష్ణ, కె.శ్రీనివాస్, మంగీలాల్, శివరామకృష్ణ, ఎం.కృష్ణ, మల్లికార్జున్ తదితరులు ఉన్నారు.